క్లుప్తంగా

నేదురుమల్లితో చెన్ను భేటీ



రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న చెన్ను తిరుపాల్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్ను తిరుపాల్‌రెడ్డి అనుచరులతో నేదురుమల్లిని ఆయన నివాసంలో కలిసి శాలువ కప్పి, సత్కరించారు.

వేమాలమ్మకు పొంగళ్లు



వేమాలమ్మగుడి వద్ద భక్తుల కోలాహం

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడిలో ఉన్న వేమాలమ్మకు ఆదివారం పొంగళ్లు ఘనంగా పెట్టారు. గ్రామస్తులు తొలుత అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఐదు గ్రామాల ప్రజలకు రోజుకొక ఊరి వంతున పొంగళ్లు పెట్టి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో మోమిడి, వరగలి, పునుగుంటపాళెం, అద్దెపల్లె, మన్నెగుంట గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

సుబ్రహ్మణ్యస్వామికి వెండి పళ్లెం బహూకరణ



వెండి పళ్లెం అందజేస్తున్న దాత

గూడూరు(చిట్టమూరు): చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామివారికి గూడూరుకు చెందిన భక్తుడు ఆదివారం వెండి పళ్లెం బహూకరించారు. పట్టణంలోని కుమ్మరవీధి ప్రాంతానికి చెందిన మహాలక్ష్మి జ్యూయలరీ అధినేత ఎస్‌ఎల్‌ఎన్ బాబు, రూ.60 వేల విలువ చేసే వెండి పళ్లాన్ని ఆలయ పాలక మండలి చైర్మన్ సాయికుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా యంత్ర ప్రతిష్ట



హోమం మండపంలో అర్చకుల సందడి

సైదాపురం: మండలంలోని పొలూరు రాజుపాళెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల వారి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఆదివారం యంత్ర ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు నిర్వహించారు. సోమవారం సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, అంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం జరపనున్నారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శ్రీనివాసులు మృతదేహం

చిల్లకూరు : మండలంలోని లింగవరం సమీపంలో ఆదివారం బైక్‌పై వెళుతూ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. తూర్పుకనుపూరు పంచాయతీ పోసినవారిపాళెం గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాసులు(32) తమ్మినపట్నం వద్ద జిందాల్ సింహపురి ఎనర్జీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కంపెనీకి వెళ్లేందుకు బైక్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ విషయం గమనించిన కార్మికులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసులు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువులు జిందాల్ పరిశ్రమ దగ్గర ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ గోపాల్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రహదారి వనం.. చల్లని ప్రయాణం



మోమిడి రహదారిలో ఇరువైపులా ఉన్న చెట్లు

చిల్లకూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారుల్లో ప్రయాణం చల్లగా సాగుతోంది. ఆ రోడ్లలో వెళ్లే ద్విచక్రవాహన చోదకులు ఆయా ప్రాంతాలకు వచ్చే సరికే కొంతసేపు సేద తీరి, వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. మండలంలోని కోట రహదారిలో కడివేడు సమీపంలోని రాజ్యలక్ష్మి కాలనీ వద్ద, గుత్తావారిపాళెం వద్ద, చింతవరం నుంచి ఏరూరుకు వెళ్లే మార్గంలో మోమిడి సమీపంలోని రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు చల్లనినీడను ఇస్తున్నాయి.

ఆర్బీకే..అన్నదాతకు అండ

నాడు వ్యవసాయం దండగ అనగా..
నేడు సేద్యం పండగ అంటూ జగనన్న ప్రభుత్వం రైతులను రాజుగా చేస్తోంది. ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, క్రిమి సంహారక మందులు, శాస్త్రవేత్తలు, అధికారుల సేవలు ఇలా అన్నీ వారి ముంగిట్లోనే అందుతున్నాయి. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవి అన్నదాతలకు విత్తు నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు అన్ని సేవలు అందిస్తున్నాయి. దీంతో గతంలో కూలీలుగా మారిన రైతులందరూ నూతనోత్సాహంతో పొలం బాట పడుతున్నారు.



పెట్లూరు రైతుభరోసా కేంద్రం

- గ్రామాల్లోనే లబ్ధిపొందుతున్న రైతులు
- రైతుభరోసా కేంద్రాల పనితీరుపై హర్షం

వెంకటగిరిరూరల్: మండలంలోని 20 పంచాయతీల్లో 14 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 10,300 మంది రైతులుండగా 2022–23 సంవత్సరానికి సంబంధించి అన్నీ ఆర్బీకేల్లో 1115.135 మెట్రిక్ టన్నులు ఎరువులు, 1,475.64 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 14 ఆర్బీకేల పరిధిలోని రైతు గ్రూపులకు 40 శాతం సబ్సిడీతో రూ.1,74,58,973 కోట్ల నిధులు మంజూరు చేసి, రూ. 6,15,8400 సబ్సిడీతో రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. రైతు భరోసా పథకం కింద రూ.2,48,54,500 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అన్నీ విధాలుగా నేనున్నాంటూ ఆదుకుంటోంది.

రైతులకు వరం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతులకు వరం. గతంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే పనులు మానుకుని పట్టణాలకు వెళ్లి, వాహనాలకు అధిక బాడుగలు చెల్లించి, వ్యయప్రయాసలకోర్చి ఇళ్లకు ఎరువులు, విత్తనాలు తెచ్చుకునేవారం. ప్రస్తుతం గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటుతో అన్నీ గ్రామస్థాయిలో అందుతున్నాయి.

\- బత్తినపట్ల వీరారెడ్డి, రైతు, పెట్లూరు

కర్షకులకు ఎంతో ప్రయోజనం



రైతులకు కావాల్సిన అన్నీ రకాలు సేవలు స్థానిక ఆర్బీకేలోనే అందుతున్నాయి. డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రైతు గ్రూపులకు సబ్సిడీతో యంత్ర పరికరాలు పొందాం. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుతున్నాయి. సాగులో సందేహాల నివృత్తికి స్థానికంగానే అధికారులు అందుబాటులో ఉన్నారు.

\- పి సుధాకర్‌రెడ్డి, రైతు, పెట్లూరు

నవరత్నాలతో పేదలకు లబ్ధి



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: రాష్ట్రంలో నవరత్నాల పథకాలతో పేద ప్రజలకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని అత్తివరం, కారూరు గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు గజమాలలు, శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను వాకాబు చేశారు. అనంతరం మహిళలకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను పేదల ఇళ్ల వద్దకే అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పక్క రాష్ట్రాల సీఎంలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీస్తున్నారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాలు ద్వారా ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చి, రైతు సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బాబురెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, నాయకులు పెద్దచెంగయ్య, చంద్రమోన్, గురుమూర్తి, అమరేంద్ర, శ్రీధర్‌రెడ్డి, కే బాబు, అర్థమాల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెప్పోత్సవం



తెప్పోత్సవానికి నది ఒడ్డున ఏర్పాటు చేసిన బారికేడ్లు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. అలాగే సుళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు చేశారు. తెప్పోత్సవానికి భక్తులు భారీగా విచ్చేసే అవకాశం ఉంది. కాళంగినదిలో ఆవిర్భవించిన అమ్మవారు మహిషాసురమర్థిని అలంకారంతో మహిషాసురుడితో యుద్ధంలో గెలిచిన విజయోత్సవానికి చిహ్నంగా కాళంగినదిలో తెప్పపై ఊరేగనున్నారు. తెప్పోత్సవం అనంతరం అమ్మవారితో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కాళంగినది సుళ్లలో జన్మించిన అమ్మవారు మహిషాసురుడ్ని వధించి విజయం సాధించిన సంతోషంలో సోమవారం రాత్రి కాళంగినదిలో తెప్పపై ఊరేగుతారు. ఈ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాటంబేడుకు చెందిన సంప్రదాయ మత్స్యకారులు ప్రత్యేకంగా తెప్పను తయారు చేసి, తెప్పోత్సవానికి అందజేస్తారు. తెప్పోత్సవం అనంతరం సుమారు రెండు గంటలపాటు బాణసంచా వేడుకలను నిర్వహించేందుకు కూడా ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారి శయనసేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

చదువుతో ఉజ్వల భవిత



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దొంతు శారద

వెంకటగిరి: చదువుతో ఉజ్వల భవిత చేకూరుతుందని నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పేర్కొన్నారు. మహాత్మగాంధీశాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.శిక్షణ పొందిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 16, 17వ వార్డు కౌన్సిలర్లు ధనియాల రాధ, పూజారి లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవి, రమేష్, రత్నశేఖర్, గ్రంథాలయాధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంపైకి దూసుకెళ్లిన ఆటో.. నలుగురికి గాయాలు

కోట: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద చల్లకాలువ బ్రిడ్జిపై ఆదివారం ఓ ఆటో జనంపైకి దూసుకెళ్లింది. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడిపి, మూడు మోటార్‌సైకిళ్లను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్యాంసుందరపురానికి చెందిన పదో తరగతి విద్యార్థి దేవేంద్ర, కోటయ్య, వెంకటరమణయ్య, రమణయ్య, శేఖర్ గాయపడ్డారు. క్షతగాత్రులను కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ లోకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు: గ్రామదేవత తాళమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పట్టణ సమీపంలో ఉన్న తాళమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రైసైకిల్ వితరణ

గూడూరు: రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో దువ్వూరు విష్ణు జితేంద్రరెడ్డి దాతృత్వంతో తిరుపాలయ్య అనే దివ్యాంగునికి ఆదివారం ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, వాసుగౌడ్, శ్రీనివాసులు, బలరామిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరి రూరల్: మండలంలోని పాలెంకోట సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లాలాపేట పంచాయతీ నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నదని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయం ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 14వ తేదీన చింతగుంట సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మధురెడ్డి, సుధాకర్, చక్రపాణి

పెళ్లకూరు: యువత క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెన్నేపల్లెలో స్థానిక సర్పంచ్ కుదిరి లక్ష్మి, చక్రపాణి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొత్తం 36 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో విన్నర్‌గా పెన్నేపల్లె జట్టు, రన్నర్‌గా ఈశ్వరవాక జట్టు నిలిచాయి. వీరికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామాల్లోని క్రీడాకారులను గుర్తించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అన్ని విధాలా ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎం సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

పేరు ప్రఖ్యాతలు తేవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి

గూడూరు: విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి, పుట్టిన ఊరుకి, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రముఖ వైద్యులు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసీఏ సబ్ సెంటర్‌లో గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్‌లు సంయుక్తంగా మే 9వ తేదీ ప్రారంభించిన క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ ట్రస్ట్ ఫర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ జనార్దన్ రెడ్డి హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని, గమ్యాన్ని చేరే వరకూ కఠోర సాధన చేయాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరన్నారు. ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి డీ శ్రీనివాసులరెడ్డి, సంయుక్త కార్యదర్శి కే మునిగిరీష్ తదితరులు ప్రసంగించిన కార్యక్రమంలో గూడూరు క్రికెట్ క్లబ్ కార్యదర్శి తూపిలి నాగేశ్వరరావు, కోచ్ లవకుమార్, మణి, మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పుట్టిన రోజువేడుకలు



పాపకన్ను రాజశేఖరరెడ్డికి కేక్ తినిపిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

రాపూరు: మండలంలోని వేపినాపి గ్రామంలో ఆదివారం రాత్రి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన తన జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి కుటుంబ సభ్యులు, నాయకులు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పీ రాజశేఖర రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పీ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, పీ దయాకర్‌రెడ్డి, సీజీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, ఎన్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు ఆశ్రమాల్లో వృద్ధులు, చిన్నారులకు జీసెస్ సెవ్ అస్ సంస్థ ప్రతినిధులు దుస్తులు, బిర్యానీ ప్యాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు జీసెస్ సెవ్ అస్ సంస్థ ప్రతినిధులు నిఖిల్ పాల్, రాఘవ, చంద్రశేఖర్ వితరణ చేసిన దుస్తులను వైఎస్సార్ సీపీ నాయకులు పసల హరిబాబు, దువ్వూరు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలోని ఉన్న జీసెస్ ఫౌండేషన్ ఆశ్రమంలోని వృద్ధులకు, ఎల్‌ఏ సాగరం కాలనీలో ఉన్న చేయూత అనాథశ్రమంలోని చిన్నారులకు దుస్తులు, బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. పేదలకు ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు జీసెస్ సెవ్ అస్ సంస్థ సభ్యులు మునీంద్ర, నాని, లక్ష్మయ్య పేర్కొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం



బాధితులకు సాయం అందిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్




మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరు(చిట్టమూరు) : చిట్టమూరు మండలం గునపాడు గ్రామంలోని గిరిజన కాలనీలో ఆదివారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా కానూరు సుబ్రమణ్యం, బాలకృష్ణకు చెందిన ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆర్డీఓ కిరణ్‌కుమార్ గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ 5 వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. బాధితులకు వెంటనే ఆధార్, రేషన్, బ్యాంక్ పాస్‌బుక్‌లు, పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

రెండు గడ్డివాములు..

వెంకటగిరిరూరల్ : మండలంలోని పాలగొండసత్రంలో ఆదివారం నక్కల లక్ష్మయ్య, నక్కల కోటేశ్వరావుకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. విద్యుత్ తీగలు తెగిపడడంతో ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారి ఆదినారాయణ తెలిపారు.

పేటకు ఎల్‌ఈడీ సొగబులు



సూళ్లూరుపేట: పట్టణంలోని హోలీక్రాస్ సెంటర్ నుంచి చెంగాళమ్మ ఆలయం దక్షిణం వైపు ఆర్చి వరకు ఎల్‌ఈడీ లైట్లు అమర్చడంతో కొత్త సొబగులు వచ్చాయి. జీఎస్‌టీ రోడ్డు మధ్యలో డివైడర్లపై విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ రోప్‌లైటింగ్ వేశారు. దీంతో పట్టణం శోభాయమానంగా మారింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చెంగాళమ్మ ఆలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సినీ హీరోయిన్ అనూ ఇమ్మాన్యుల్ పలకరింపు అందరిని ఆకట్టుకుంది. జీ తెగులు సరిగమల బృందం, సినీ ప్లేబ్యాక్ సింగర్ శివ, సాయి, చరణ్, శివానీ, శ్రీకాంగ్, ఫోక్ సింగర్ మౌనిక బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పాట కచేరి భక్తులకు వీనుల విందు చేసింది. జబర్దస్త్ కామెడీ నటుడు నూకరాజు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన హాస్యవల్లరి సభికులను కడుపుబ్బ నవ్వించింది. సాగర్ మాస్టర్ బృందం డ్యాన్స్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సినీ యాంకర్ ఐశ్వర్య మాటలు అందరినీ కట్టి పడేశాయి. పద్మశ్రీ అవార్డు గ్రహీత తెలంగాణకు చెందిన మొగులయ్య బుర్ర కథ సంగీతం ఆకట్టుకుంది.

చెంగాళమ్మ సేవలో మంత్రి కాకాణి

సూళ్లూరుపేట: రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన ఆలయానికి విచ్చేయగానే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాటు చేపట్టారు. మంత్రి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మంత్రికి వేద పండితుల ఆశీర్వాదం పలికి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం సుళ్ల ముగింపు ఉత్సవంలో ఆయన పాల్గొని, సుడిమానును తిప్పారు.



నృత్యం చేస్తున్న హీరోయిన్ అనుఇమ్మాన్యుల్



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



బుర్రకథ ఆలపిస్తున్న మొగులయ్య